క్లుప్తంగా

డిప్యూటీ సీఎంతో ఎమ్మెల్యే భేటీ



భట్టితో చర్చిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం హైదరాబాద్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పాల్వంచలో 800 మెగావాట్ల చొప్పున రెండు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, కేటీపీఎస్‌లో జరిగిన స్క్రాప్ కుంభకోణంపై విచారణ జరిపించాలని కోరగా.. ఉద్యోగుల బదిలీ అంశంపైనా చర్చించారు. అంతేకాక నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై చర్చించినట్లు ఎమ్మెల్యే ఓ ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): ఈపీ టెక్నీషియన్లకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయాలని, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు కోరారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌ఫర్ల కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారని వారు కుటుంబాలకు దూరంగా ఉంటూ డ్యూటీలు చేస్తున్నట్లు చెప్పారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారి



బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యనారాయణ

ఇల్లెందురూరల్: మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా ఉద్యాన అధికారి సూర్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం మంగళవారం ముగియడంతో ప్రత్యేకాధికారిగా సూర్యనారాయణకు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలను నియంత్రించండి..

జూలూరుపాడు: వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు బుధవారం మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ తాళ్లూరి రవికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామాల్లో వీధి కుక్కలు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. బాధితులు ర్యాబిస్ వ్యాధి బారిన పడకుండా ముందుస్తుగా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందురూరల్: విద్యార్థి దశ నుంచే యువతులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ చంద్రభాను అన్నారు. సుదిమళ్ల గిరిజన గురుకుల కళాశాలలో మహిళా చట్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి వాటి వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసేటప్పుడు వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించేందుకే షీటీంలు పనిచేస్తున్నాయని, అత్యవసరమైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ రత్నకుమారి, ఎస్సైలు నాగుల్‌మీరా, సూర్యం పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి

ఇల్లెందు: విద్యార్థులు చదువు మీద దృష్టి కేంద్రీకరించాలని, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఇల్లెందు ఎస్ఐ నాగుల్ మీరా పటాన్ అన్నారు. బుధవారం శ్రీ చైతన్య కాలేజ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా యువత మత్తుకు బానిసలుగా మారుతున్నారని తెలిపారు. పిల్లలను తల్లిదండ్రులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పత్తి శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పొంగిపొర్లిన వాగులు



పాల్వంచరూరల్: జగన్నాథపురం - తోగ్గూడెం రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం బుధవారం రోజంతా కొనసాగింది. ముసురుతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రహదారులన్నీ జలమయం అయ్యాయి. జోరువాన కురుస్తుండటంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా వరదనీరు చేరింది. పంటలు నీట మునిగాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు వాగులు, లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించారు. ప్రజలు వాగులు దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా పంచాయతీ సెక్రటరీలను అధికారులు ఆదేశించారు. వాగుల వద్ద బారీకేడ్లు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లను అడ్డుగా పెట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఆపదలో ఉంటే తక్షణమే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: రోళ్లపాడు మార్గంలో గుండంవాగు ప్రవాహం





కొత్తగూడెంటౌన్: రామవరంలో జలమయం, మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డు



పాల్వంచ: పొంగి ప్రవహిస్తున్న వర్రేడు వాగు



చుంచుపల్లి: పెనుబల్లి చప్టాను పరిశీలిస్తున్న అధికారులు



టేకులపల్లి: ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ వద్ద బుగ్గవాగు ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు



జూలూరుపాడు: పడమటనర్సాపురం తుమ్మలవాగు వద్ద ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టిస్తున్న అధికారులు



కరివారిగూడెం పెద్దవాగు ఉప్పొంగడంతో నీటమునిగిన పత్తి చేను



పాల్వంచరూరల్: జగన్నాథపురంలో ఇంట్లోకి వచ్చిన వరద నీరు

పోలీసుల తీరుపై న్యాయవాదుల నిరసన

కొత్తగూడెంటౌన్: న్యాయవాదులపై పోలీసులు దాడి చేయడం దారుణమని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. దాడికి నిరసనగా బుధవారం నల్లబ్యాడ్జిలు ధరించి జిల్లా కోర్టులో విధులకు హాజరయ్యారు. లక్కినేని మాట్లాడుతూ.. జనగామ జిల్లాలో న్యాయవాద దంపతులపై పోలీసులు దాడి చేయడం దారుణం అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. తోట మల్లేశ్వరరావు, ఎంఎస్ఆర్ రవిచంద్ర, డి.రవికుమార్, సాధిక్‌పాషా, ఎన్.ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

గని సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 ఇంక్‌లైన్ గని సమస్యలు పరిష్కరించాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. బుధవారం జీఎం చాంబర్‌లో ఆయన జీఎంతో మాట్లాడారు. ఏరియాకు శ్రీరాంపూర్ ఏరియా నుంచి 50 మంది జనరల్ మజ్దూర్‌లు, మణుగూరు ఏరియా నుంచి 15 మంది టెక్నీషియన్లు వస్తున్నారని, సీనియారిటీ ప్రకారం పంపించాలని కోరారు. అదేవిధంగా ఏరియాలో పారిశుద్ధ్య పనులు చేయించాలని సూచించారు.

చీరలు పంపిణీ

ఇల్లెందురూరల్: పోచారం గ్రామంలో తీజ్ వేడుకలు నిర్వహించుకునే యువతులకు గ్రామంలో వాంకుడోత్ శ్రీను కుటుంబ సభ్యులు బుధవారం చీరలు పంపిణీ చేశారు. వాంకుడోత్ భారతి, లోక, బుల్లి, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై అధికారులు స్పందించాలి



బ్యాంకు అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యపై బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కోరారు. రుణమాఫీ వర్తించక ఇబ్బందులు పడుతున్న లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, బంగారుచెలక, మైలారం తదితర గ్రామాలకు చెందిన రైతులతో కలిసి బుధవారం ఐఓబీ సందర్శించి అధికారులతో మాట్లాడారు. మాట్లాడుతూ... ఇతర బ్యాంకులలో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ జరిగిందని, సాంకేతిక కారణాలతో ఐఓబీలో సుమారు 300 మందికి పైగా రైతులకు మాఫీ వర్తించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి, రైతులు లాలు, బిక్కు, భీమ్లా, హరి, సూనావత్ జగ్గు, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

జూలూరుపాడు: జూలూరుపాడు సహకారం సంఘంలోని రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను వైరా క్యాంపు కార్యాలయంలో బుధవారం సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం, డైరెక్టర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ భిక్షం మాట్లాడుతూ... పట్టాదారు పాస్ పుస్తకం లేకుండా మాన్యువల్ పహణీపై రుణాలు తీసుకున్న రైతులకు కూడా రుణమాఫీ చేయాలన్నారు. అదేవిధంగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్న పలువురు రైతులకు మాఫీ కాలేదని వివరించారు. కార్యక్రమంలో చాపలమడుగు రామ్మూర్తి, ఎన్వీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాత బస్సులను తొలగించండి..

ఇల్లెందు: గుండాల – ఇల్లెందుకు బస్సులు వర్షానికి కురుస్తున్నాయి. ఎప్పుడు, ఎక్కడ ఆగి పోతాయో తెలియడం లేదు. అన్ని బస్సులూ పాతవే. గుండాల ప్రయాణికులు అంటే ఆర్టీసీ అధికారులకు చులకనగా ఉందని, ఈనెల 15 లోపు బస్సులు మార్చకపోలే డిపో ఎదుట ఆందోళన చేపడతామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు హెచ్చరించారు. బుధవారం గుండాల రోడ్డు వెళ్లిన అన్ని బస్సులు రోజంతా కురిసిన వర్షానికి ప్రయాణికులు తడిచి ముద్దయ్యారని పేర్కొన్నారు. ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే ఆర్టీసీ అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎన్డీ నేతలు తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, బొగ్గారపు సంగయ్య, ఇర్ప రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎన్డీ నాయకులు

మహిళలకు రాత పరీక్ష



పరీక్షకు హాజరైన మహిళలతో జీఎం దంపతులు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ నేర్చుకున్న మహిళలు స్వయం ఉపాధి పొందటమే కాకుండా ఇతరులకు శిక్షణ ఇవ్వాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు అన్నారు. బుధవారం కొత్తగూడెం ఏరియాలో సేవా సమితి ద్వారా ఉచిత టైలరింగ్, మగ్గంవర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ వంటి స్వయం ఉపాధి వృత్తి శిక్షణ పొందిన మహిళలకు ఆర్‌సీఓఏ క్లబ్‌లో రాత పరీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ.. రామవరం, రుద్రంపూర్, గౌతంపూర్ తదితర సెంటర్లలో శిక్షణ పూర్తి చేసుకున్న 206 మందికి ఈరోజు పరీక్ష నిర్వహించటం జరిగిందన్నారు.

నేడు ఇల్లెందులో

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా శిక్షణ పొందిన మహిళలకు ఈ నెల 9న ఇల్లెందు జేకే సింగరేణి స్కూల్‌లో ఉదయం 9.30 గంటలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పరీక్ష సింగరేణి సేవా సమితి ఖాదీ గ్రామీణోద్యోగ మహా విద్యాలయం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. కోర్సులు నేర్చుకున్న మహిళలు రాత పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

మండల పరిషత్ పాలకవర్గానికి సన్మానం



మండల పరిషత్ పాలకవర్గంతో ఎమ్మెల్యే కోరం కనకయ్య, అధికారులు

ఇల్లెందురూరల్: ఐదేళ్లు మంచిపాలన అందించిన మండల పరిషత్ పాలకవర్గానికి వీడ్కోలు కేవలం పదవికి మాత్రమేనని, ప్రజాసేవ నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.

మండలంలోని ఎస్ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మండల పరిషత్ పాలకవర్గం వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్లు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పరిషత్ పాలకవర్గం ప్రతినిధులు అభినందనీయులన్నారు. అనంతరం పాలకవర్గం ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమాదేవి, వైస్ ఎంపీపీ మండల రాము, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, మండల ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి..

ఇల్లెందురూరల్: హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు పరిసరాలలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. కొమ్ముగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు బుధవారం కిన్నెరసానిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉల్వనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజశ్రీ 90మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ భీమ్‌సింగ్, ఏఎన్‌ఎం రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శంకర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

టేకులపల్లి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని టేకులపల్లి మండల వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఏకలవ్య, బీసీ బాలుర గురుకులం, గిరిజన బాలుర, బాలికల వసతి గృహం, కేజీబీవీ పాఠశాలల్లో సులానగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రావు, కస్తూర్బా గాంధీ గురుకుల ప్రిన్సిపాల్ సంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు సింగరేణి కార్యాలయం ఎదుట ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలన్న డిమాండ్‌తో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహిస్తున్నట్లు హెచ్ఎంఎస్ ప్రధాన కార్యాదర్శి రియాజ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గంటలకు మొదలయ్యే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ



ఇంటిగోడ కూలిన దృశ్యం

జూలూరుపాడు: బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మాచినేనిపేట తండాలో బోడా రాము ఇంటి మట్టి గోడ కూలిపడిపోయింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నాడు. గోడ బయట వైపు పడిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ప్రభుత్వ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.

ఆర్థిక సాయం

పాల్వంచ: హైదరాబాద్‌లో జేఎన్‌టీయూ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న బూర్గంపాడుకు చెందిన ఎం.సాయివినయ్ చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. బుధవారం మహిళా సమాఖ్య పట్టణ నాయకురాలు గుగులోతు భద్రమ్మ జ్ఞాపకార్థ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు రూ.10వేల నగదును విద్యార్థి తండ్రి బాలకృష్ణకు అందించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉందని పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖాధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని, వైద్యశిబిరాల ఏర్పాటుకు సిద్ధం కావాలన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది ప్రజాక్షేత్రాలలో సేవలందించాలన్నారు. యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.10.50 కోట్లు...

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ అభివృద్ధికి వివిధ గ్రాంట్‌ల ద్వారా రూ.10.50 కోట్లు మంజూరు అయ్యాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గట్టాయిగూడెం రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.94లక్షల నిధులు మంజూరయ్యాయని, లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరితగతిన టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

'స్వచ్ఛదనం – పచ్చదనం' విజయవంతం చేయాలి



హాజరైన ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులు

టేకులపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగొద్దని ఈజీఎస్, సిబ్బంది, కార్యదర్శులు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు అన్నారు. బుధవారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మిగిలిన రెండు రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మాట్లాడారు. గురువారం జ్వర సర్వే, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన, కుక్కల వివరాలు, నీటి ద్వారా వచ్చే రోగాలపై అవగాహన, శుక్రవారం శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాల కూల్చివేత, ఇల్లు, కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న పనికిరాని వస్తువులను తొలగించడం, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులతో పాటు దుమ్ము వంటి వ్యర్థాలను తొలగించే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, కంపోస్టు ఎరువు గుంతలు, పశువుల షెడ్లు, మునగ తోట, డ్రాగన్ ఫ్రూట్ పెంపకంపై సమీక్షించారు.

డీపీఓ పర్యటన

జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి డీఎల్‌పీఓ, మండల అధికారులతో కలిసి బుధవారం టేకులపల్లి మండలంలో పర్యటించారు. వరద ఉధృతి ఉన్న గ్రామ పంచాయతీల్లో వాగులను పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం లచ్చగూడెం పాఠశాలలో ఇంకుడు గుంతలను, డంపింగ్ షెడ్లను పరిశీలించారు. పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు.

పలు సమస్యలకు పరిష్కారం



కరకవాగు వద్ద ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న కమిషనర్

పాల్వంచ: స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో పలు సమస్యలను అధికారులు బుధవారం పరిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ దాకూ నాయక్ ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లో నిల్వ ఉన్న నీటిని డ్రెయినేజీలోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. బస్టాండ్ ఏరియా, కరకవాగు ప్రాంతాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. బీసీఎం రహదారిపై గుంతలను పూడ్చి మరమ్మతులు చేశారు. డీఈ స్వరూపరాణి, టీపీఓ సత్యనారాయణ, ఎస్ఐ లక్ష్మణ్‌రావు, మేనేజర్ ఎల్‌వీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపండి...

వర్షాలకు బస్టాండ్ ఆవరణం చెరువులా దర్శనమిస్తోందని, లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ దాకూ నాయక్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. మాట్లాడుతూ.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు, రోడ్లు లేకుండా ఉన్నాయని, వాటిని గుర్తించి తక్షణం నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. కుక్కలబెడద అధికం ఉందని, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, అడుసమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, రాహుల్, ఇట్టి వెంకట్రావ్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమైనవి



ఇల్లెందురూరల్: గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమైనవని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్ట్ సీడీపీఓ అరుణకుమారి అన్నారు. మండలంలోని రొంపేడు చెక్‌పోస్టు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ పాఠశాలల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎటువంటి అపోహలకు అవకాశం ఇవ్వకుండా బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని, తద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి వస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కొమరమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు చందరకళ, దయావతి, విజయ, సౌజన్య, ఆశా వర్కర్లు పుష్ప, స్వప్న పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల రైతు వేదికలో జరిగిన తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ఐటీడీఏ పీఓ బి.రాహుల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో గర్భిణులు, బాలింతలు, పోషకాహార లోపం, రక్తహీనత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కపిల్ శర్మ, డాక్టర్ అర్చన, సోడి గంగ, అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పాల్గొన్నారు. రేగళ్ల పంచాయతీ కొత్తూరు ఎంపీపీఎస్ పాఠశాలలో కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.